ప్రజాశక్తి

సోమవారం 8 ఏప్రిల్ 2024

5

అల్లూరి సీతారామరాజు



ఎస్ఎస్‌సి స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు: పాడేరులోని తలారసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఎస్‌సి స్పాట్ వాల్యూయేషన్ సెంటర్‌ను ఆదివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ విజయ సునీత సందర్శించారు. ఈ సందర్భంగా వాల్యూయేషన్ నిర్వహణ తీరుపై ఉపాధ్యాయులను అడిగి తెలుసు కున్నారు. ఏర్పాట్లను సమీక్షించి ఆమె సంతృప్తిని వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు, డిప్యూటీ క్యాంప్ కమిషనర్ కుమార్ తదితరులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సమ్మె కాలపు వేతనాలు చెల్లించేదెన్నడో?

మాటతప్పిన ప్రభుత్వం ▸▸ ఆర్థిక ఇబ్బందుల్లో అంగన్వాడీలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్:
మూడు నెలల క్రితం తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టిన అంగన్‌వాడి ఉద్యోగులకు సమస్యల పరిష్కారం మాట ఎలా ఉన్నా వేతనాలు కూడా దక్కని పరిస్థితి వచ్చి పడింది. సమ్మె విరమించి ఇప్పటికీ రెండు నెలలు దాటుతున్నా సమ్మె కాలానికి సంబంధించి వారికి రావాల్సిన వేతనాలు నేటికి అందలేదు. ఇదిగో అదిగో అంటూ రెండు నెలలుగా నెట్టుకొచ్చిన ప్రభుత్వం వారికి వేతనాలు ఇవ్వలేకపోయింది. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో వారికి వేతనాలు వస్తాయా? రావా? అన్న ఆందోళనలో అంగన్వాడీలు అల్లాడిపోతున్నారు.

జిల్లాలో అంగన్ వాడీల సమ్మె ఒక చారిత్రాత్మకం. తమ డిమాండ్ల సాధన కోసం 42 రోజుల సుదీర్ఘకాలం పాటు విధులకు దూరంగా ఉంటూ ఆందోళన బాటపట్టారు. అంగన్వాడి కేంద్రాలను ఏళ్ళకేళ్ళుగా వేధిస్తున్న సమస్యల పరిష్కారం కోసం కనీస వేతనాల కోసం అంగన్వాడి ఉద్యోగులు కిందటేడాది డిసెంబరు 8న సమ్మెకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం చర్చలకు పిలవడంతో దాన్ని డిసెంబర్ 12 వరకూ వాయిదా వేసుకున్నారు. చర్చలు విఫలమవడంతో విధి లేని పరిస్థితిలో డిసెంబర్ 12న సమ్మెకు దిగారు. ఆ రోజు నుంచి ఈ ఏడాది జనవరి 23 వరకూ ప్రభుత్వం అధికారులు ఎన్ని రకాలుగా భయపెట్టినా, బెదిరించినా, ఎస్మా ప్రయోగించినా వెరువక 42 రోజులపాటు సమ్మె చేశారు. ఉద్యమ క్రమంలో చర్చల పేరుతో ఉద్యోగులను పిలిచిన ఒక్క సమస్యపై కూడా ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వలేదు. ఉద్యోగులు ఇంతకీ లొంగి రాకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపుకు ఆదేశాలు జారీ చేసింది వాటిని కూడా ఉద్యోగులు లెక్క చేయక తమ ఆందోళనను కొనసాగించారు. ఎట్టకేలకు దిగివచ్చిన వైసిపి ప్రభుత్వం అంగన్ వాడీలతో పలు ఒప్పందాలు చేసుకుని హామీలు గుప్పించింది. సమ్మె కాలానికి కూడా వేతనాలు ఇస్తామని అంగీకరించింది. ఇది జరిగి సుమారు రెండు నెలలవుతున్న ఇప్పటిదాకా సమ్మె కాలానికి వేతనాలు అందలేదు. పెండింగ్ జీతం ఎప్పుడు వస్తుందోనని అంగన్ వాడీలు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

జిల్లాలో 19 ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో 3214 అంగన్ వాడి కేంద్రాలు ఉండగా, 4500 మంది అంగన్ వాడీలు, హెల్పర్లు పని చేస్తున్నారు. అంగన్ వాడీ టీచర్లకు రూ.11,500, హెల్పర్లకు రూ.7వేలు వేతనం ఇస్తున్నారు.

కొన్నింటికే జిఒల విడుదల

కేవలం ఐదు హామీలకు మాత్రం ప్రభుత్వం జిఒలు విడుదల చేసింది. అంగన్ వాడీలకు గ్రాట్యూటీ సంబంధించి కేంద్రానికి సిఫార్సు చేస్తామని, ఉద్యోగ విరమణ సమయంలో వర్కర్లకు రూ.50 వేల నుంచి లక్ష రూపాయలకు పెంచుతున్నట్లు అంగీకరించి వాటిని అమలు చేస్తోంది. విధి నిర్వహణలో ఎవరైనా చనిపోతే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, వైఎస్ఆర్ బీమా మట్టి ఖర్చులకు రూ.20వేలు ఇస్తామని అంగీకరించింది.

సమ్మె ఒప్పందాలు అమలేది!?

అంగన్ వాడీల సమ్మె సందర్భంగా 11 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు. వాటన్నిటిని అమలు చేస్తామని ప్రభుత్వం అంగన్ వాడీలతో ఒక అంగీకారానికి వచ్చింది. అయితే ప్రస్తుతం కొన్ని డిమాండ్లు మాత్రమే అమలు అవుతున్నాయి. మిగిలిన వాటిని త్వరలో అమలు చేస్తామని ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. నేటికీ అవి అమలు కాలేదు. అంగన్ వాడీ వేతనాల పెంపు మాత్రం జూలై నుంచి ఉంటుందని ప్రభుత్వం మెలిక పెట్టింది. గ్రేడ్–2 సూపర్ వైజర్ పోస్టులకు పరీక్ష రాసి పెండింగ్ లో ఉన్న పోస్టుల భర్తీ ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది. ఈ ప్రతిపాదన ముందుకు సాగే అవకాశం లేదు. 4 యాప్ లు కలిపి ఒకే యాప్ రూపొందిస్తామని ప్రభుత్వం వెల్లడించినా ఇప్పటికీ అమలు కాలేదు. వేతనాలతో కూడిన మెడికల్ లీవ్, పోషణ మెను చార్జీల పెంపు, గ్యాస్ తదితర సమస్యలకు కమిటీ వేయిస్తామని హామీ ఇచ్చింది. ఇది ఇప్పటికీ పూర్వపుతులో తెలియని పరిస్థితి నెలకొంది. మినీ అంగన్ వాడీలను మెయిన్ సెంటర్ లుగా చేస్తామన్న హామీ కూడా అమలుకు నోచుకోలేదు. అంగన్ వాడీ హెల్పర్లకు పదోన్నతులు, 2017 నుంచి పెండింగ్ లో ఉన్న టిఏ బిల్లు, ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచింది.



డుంబ్రిగుడలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్ ఫోటో)

హామీలు అమలు చేయాలి

ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఎలా? ప్రభుత్వం ఎంతో నమ్మకంగా సమ్మె కాలానికి జీతాలు ఇస్తామని చెప్పింది. సమ్మె విరమణ చేసి రెండు నెలలైనా ఇప్పటికీ జీతాలు పడలేదు. ఇది కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని తమకు అనుమానం కలుగుతుంది. మరోసారి ఆందోళనకు దిగాలా. 42 రోజులపాటు సమ్మె చేశాం. మా సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం అంగీకరించింది.



చిన్నారి,
పాడేరు మండల కార్యదర్శి,
అంగన్ వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

కావాలనే ప్రభుత్వం తాత్సారం

అంగన్ వాడీల సమ్మె కాలానికి వేతనాలు ఇస్తామని ప్రభుత్వం అంగీకరించింది. అయితే ఇప్పుడు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ కూడా అమలులోకి వచ్చింది. ఇక జీతాలు వస్తాయా అనేది అనుమానమే! కావాలని ఎన్నికల కోడ్ వరకూ తాత్సారం చేసింది. 11 డిమాండ్ లను ప్రభుత్వం ముందు ఉంచితే కేవలం కొన్నింటికి మాత్రమే జిఒలు జారీ చేసింది.



వి.భాగ్యలక్ష్మి
జిల్లా ప్రధాన కార్యదర్శి
అంగన్ వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

సిపిఎం అభ్యర్థుల గెలుపుతోనే.. గిరిజనుల సమస్యలు పరిష్కారం

▸▸ అరకు సిపిఎం పార్లమెంట్ అభ్యర్థి అప్పలనర్స, జెడ్‌పిటిసి గంగరాజు ▸▸ బస్కిలో ముమ్మర ప్రచారం

ప్రజాశక్తి-అరకులోయ: త్వరలో జరగనున్న అరకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపిస్తేనే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, అనంతగిరి జెడ్పిటిసి దీసరి గంగరాజులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏజెన్సీ అభివృద్ధికి నిరంతరం పోరాడుతున్న పార్టీ ఒక సిపిఎం మాత్రమేనన్నారు.జివో 3కు చట్ట బద్ధత, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల సాధనకు ఆదివాసి గిరిజనుల తరపున చట్ట సభల్లో పోరాడి సాధించుకోవడం సిపిఎంతోనే సాధ్యమవుతుందని తెలిపారు. ఆదివాసి గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన 1/70 చట్టం పటిష్టంగా అమలు, బాక్సైట్, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులను రద్దు కోసం, మైనింగ్ అటవీ సంపదలను కాపాడుకోవడానికి సిపిఎం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. బిజెపికి తొత్తుగా ఉన్న టిడిపి, వైసిపి, జనసేన పార్టీలను ఆదివాసీలను ఓడిస్తేనే భవిష్యత్తులో గిరిజనులకు మనుగడ ఉంటుందని చెప్పారు. ఈ ఐదేళ్ల కాలంలో ఒక్క డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. వేసవి కాలంలో మంచినీరు కల్పించడానికి కనీసం ప్రణాళికలు కూడా తయారు చేయలేని ప్రభుత్వాలు గిరిజనుల అభివృద్ధిని ఎలా చేస్తాయని వారు ప్రశ్నించారు. ఈ పరిస్థితుల్లో గిరిజన ప్రాంత సమగ్ర అభివృద్ధికి పోరాడుతున్న సిపిఎం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బస్కి మాజీ ఎంపీటీసీ, సిపిఎం మండల పార్టీ నాయకుడు బురిడీ దశరథ్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కిండంగి రామారావు, పొద్దు బాలదేవ్, పాంగి రాజు, పూజారి చందర్, బురిడి గోపాల్, సమర్ధి మెద్నొ, కృష్ణ, స్వామి, గోవింద్, వార్డు మెంబర్ సమర్ధి మొస్య, గొల్లూరి అప్పలనాయుడు, బురిడి కొండబాబు, సౌన బాబు, శోభన్ పలు గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.



అప్పలనర్సకు తిలకందిద్దుతున్న మహిళ



ప్రచారంలో గిరిజనులతో కలిసి నినదిస్తున్న సిపిఎం నేతలు అప్పలనర్స, గంగరాజు

నిర్వాసితుల సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న లోతా రామారావు, పక్కన కిరణ్

ప్రజాశక్తి- కూనవరం : పోలవరం ముంపు బాధిత నిర్వాసితులందరికీ పూర్తిస్థాయి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు. మండలంలోని పెదర్యాకర్ గ్రామంలో మాజీ ఎంపిటిసి పాయం సత్యనారాయణ అధ్యక్షతన జరిగి సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నారే తప్ప, పోలవరం నిర్వాసితులకు న్యాయం జరగడం లేదని, గిరిజన సమస్యలకు పరిష్కారం దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు కింద ముంపు బారిన పడిన పొలాలకు ఇప్పటివరకు వచ్చిన నష్టపరిహారం రూ.1.15లక్షలను రూ.ఐదు లక్షలకు పెంచి వెంటనే చెల్లిస్తానని ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి హామీ ఇచ్చి, అమలు చేయకుండా నిర్వాసితులను మోసం చేశారని ఆరోపించారు. ముంపు భూములకు పరిహారం పెంపును గాలికొదిలేశారన్నారు. జిఒ3రద్దు విషయంలోనూ వైసిపి ప్రభుత్వం మన్యవాసులకు అన్యాయం చేసిందన్నారు.సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు మాట్లాడుతూ, ముంపు ప్రాంత ప్రజల కష్టాలు పరిష్కారమై, వారికి న్యాయం జరిగే వరకు పోరాడతానన్నారు కార్యక్రమంలో వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు, పాయం సీతారామయ్య, ఎంపిటిసిలు జయసుధ, అమ్మాజీ, సర్పంచులు నాగమణి, వెంకమ్మ, న్యాయవాది రవితేజ పాల్గొన్నారు.

'వంతల'కు టిక్కెట్‌పై పునరాలోచించాలి



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -అడ్డతీగల : రంపచోడవరం ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయింపుపై అధిష్టానం పున్ణపరిశీలన చేసి పార్టీలో ఉన్న సీనియర్లలో ఎవరికి సీటు ఇస్తే సమిష్టిగా పనిచేసి గెలిపించుకుంటామని,కార్యకర్తల మనోభావాలకు వ్యతిరేకంగా మిరియాల శిరీష దేవిని కొనసాగిస్తే మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని టిడిపి శ్రేణులు ఏకగ్రీవంగా తీర్మానించారు ఆదివారం అడ్డతీగల మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ అన్నం సత్యనారాయణ రెడ్డి నాయకత్వంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, గ్రామ కమిటీ అధ్యక్షులు,బూత్ కమిటీ కన్వీనర్లు, యూనిట్ ఇన్చార్జిలు, సమావేశమయ్యారు.ఈ సందర్భంగా సీనియర్ నాయకులు మాట్లాడుతూ పార్టీ శ్రేణుల మనోభావాలను గుర్తించి, పార్టీ ఆవిర్భావం నుంచి ఉంటున్న సీనియర్లకు గౌరవించాలని కోరారు. అధిష్టానం మొండివైఖరి ప్రదర్శిస్తే, తాము మూకుమ్మడిగా పార్టీని వీడుతామని స్పష్టం చేశారు. శిరీష వద్దు వంతలే ముద్దు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అన్నం సత్తిబాబు, జత వెంకటరమణారెడ్డి, ఎడ్ల శ్రీనివాస్,జజ్జవరపు శ్రీనివాస్ చౌదరి, మాజీ సర్పంచ్ చెక్కస్వాములు, సత్తి సత్తిరెడ్డి, మేడిశెట్టి శ్రీనివాస్, పి శ్రీనివాస్ రెడ్డి సీనియర్ నాయకులు పాల్గొన్నారు

వంతల అభ్యర్థిత్వానికి సంఘీభావం

రంపచోడవరం : రంపచోడవరం టిడిపి ఎమ్మెల్యే టిక్కెట్ మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరికి కేటాయించాలని ఆపార్టీ నేతలు డిమాండ్ చేశారు. వంతలకు సంఘీభావంగా మండలం బి.వెలమలకోట పంచాయతీలో సమావేశం నిర్వహించారు. బి.వెలమలకోట సర్పంచ్ వంతల అచ్చియమ్మ, క్లస్టర్ ఇంఛార్జ్ కారం సింహాచలం,యూనిట్ ఇంఛార్జ్ బుడ్డిగ ప్రసాద్ మాట్లాడుతూ ఐదేళ్లపాటు అనంతబాబు అరాచకాలకు భరిస్తూ, అతని పెట్టే కేసులు ఎదుర్కొంటూ, పార్టీ కోసం పనిచేసిన వారిని కాదని, వేరే వ్యక్తికి టిక్కెట్ కేటాయించడం సరికాదన్నారు. రంపచోడవరంలో టిడిపి విజయకేతనం ఎగరేయాలంటే వంతలకే టిక్కెట్ కేటాయించాలని కోరారు. దీనిపై అధినేత చంద్రబాబు పునరాలోచించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో బూత్ ఇంచార్జ్ చొల్లం వీరబాబు, కారం శివ, మచ్చ అబ్బులు, లచ్చన్నదొర, కానే,ఎం రాజు, బాపిరాజు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.



ప్రచారం చేపడుతున్న నాయకులు

మండుటెండలో ఉపాధి హామీ పనులు

▸▸ పని ప్రదేశంలో కానరాని సౌకర్యాలు

▸▸ ఇబ్బంది పడుతున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఉపాధి హామీ పనులు చేపడుతున్న పని ప్రదేశంలో కూలీలకు కనీస మౌలిక సౌకర్యాలు లేక మండుటెండలో పనులు చేస్తున్నారు. దీంతో, ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు చేపడుతున్న పని ప్రదేశంలో టెంట్, తాగునీరుతో పాటు ప్రథమ చికిత్స మెడికల్ కిట్టు, వేసవిలో మజ్జిగ వంటి సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. పని ప్రదేశంలో ఇటువంటి సౌకర్యం కల్పించలేదు. దీంతో ఉపాధి కూలీలు మండు టెండల్లోనే పనులు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో నీడ సౌకర్యం లేక ఉపాధి కూలీలు ఎండల్లో మండుతూ పనులు చేపడుతున్నారు. గతంలో పని ప్రదేశంలో టెంట్, మంచినీరు, ప్రథమ చికిత్స కిట్టుతో పాటు చిన్న పిల్లలను ఆడించడానికి ఆయా వంటి సౌకర్యాలను కల్పించేవారు ప్రస్తుతం అటువంటి సౌకర్యాలు కల్పించ లేదని పలువురు ఉపాధి కూలీలు అంటున్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ఎండల్లో పనిచేస్తూ ఉపాధి కూలీలు వడదెబ్బకు గురయ్యే పరిస్థితి ఉందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు చేసేటప్పుడు ప్రమాదవశాత్తు పనిముట్లు తగిలి గాయాలైన వడదెబ్బకు గురైన వెంటనే మెడికల్ కిట్లు లేక ప్రథమ చికిత్స చేయించుకోలేని పరిస్థితి ఉందని ఉపాధి కూలీలు అంటున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పని ప్రదేశాలను సౌకర్యాలు కల్పించాలని మండలంలోని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి

ఉపాధి పని ప్రదేశాల్లో టెంట్, మంచినీరు, మెడికల్ కిట్టు సౌకర్యం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండుటెండర్లు ఉపాధి పనులు చేస్తూ వడదెబ్బకు గురయ్యే పరిస్థితి ఉంది. పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పిస్తున్నట్లు అధికారులు చెప్పడం తప్ప ఆచరణలో చర్యలు తీసుకోవడం లేదు. ప్రమాదవశాత్తు గాయాలకు గురైతే వెంటనే వైద్యం చేయించలేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అధికారులు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి.

టి.సూర్యనారాయణ,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు

ఆదివాసీ యువకులపై దాడికి దిగిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- ఎమ్మెల్సీ, అతని అనుచరులు, పోలీసులపై కఠినచర్యలు చేపట్టాలి
- అనంతబాబు అరాచకాలు ఆపకుంటే తిరుగుబాటు తప్పదు : సిపిఎం



గిరిజన యువకుల గాయాలను పరిశీలిస్తున్న లోతా రామారావు, కిరణ్

ప్రజాశక్తి- కూనవరం: ఆదివాసీ యువకులపై దాడి ఘటనలో వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబు, అతని అనుచరులు, పోలీసులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు డిమాండ్ చేశారు. ఆదివారం కుటూరు గ్రామంలో అనంతబాబు, అతని అనుచరుల దాడిలో గాయపడ్డ బాధితులను పరామర్శించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో ఎమ్మెల్సీ అనంతబాబు అరాచకాలు, దౌర్జన్యాలు ఆపకపోతే గిరిజనుల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కుటూర్‌లో జరిగిన సంఘటనలో పోలీసుల తీరుపై ఎన్నికల అధికారులు, పోలీస్ ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు కొత్త భూసేకరణ చట్టం ప్రకారం పునరావాసం కల్పన, జిఒ 3 పునరుద్ధరించి చట్టబద్ధత, ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల, బోయ/వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చే అంశంపై అసెంబ్లీలో తీర్మానం, అటవి సంరక్షణ సవరణ బిల్లు ఆమోదం వంటి సమస్యలపై ఎన్నికల ప్రచారానికి కూటూరు వచ్చిన ఎమ్మెల్సీ అనంతబాబును ప్రశ్నించి, నిలదీసేందుకు యత్నించిన అమాయక ఆదివాసీ యువకులపై వైసిపి గూండాలు, పోలీసుల దాష్టికం దారుణమన్నారు. గిరిజన యువకులను తుపాకులతో బెదిరించడంతోపాటు తుపాకి మడమతో కొట్టడంతో మిడియం రాము తలపైనా, సోడే వినోద్‌కు వీపుపైనా తీవ్రగాయాలయ్యాయన్నారు. ఇదే ఘటనలో ఎమ్మెల్సీ అనంతబాబుతోపాటు వైసిపి కార్యకర్త మరియదాసు, మరికొందరు ఎమ్మెల్సీ అనుచరులు, వైసిపి గూండాలు దాడికి తెగబడ్డారని రంపచోడవరం నియోజకవర్గం,కూనవరం మండలం,కూటూరు గ్రామంలో సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్సీ అనంత బాబును ప్రశ్నించినందుకు అనంత బాబు, అనుచరులు, స్థానిక వైసిపి కార్యకర్త మరియదాసు,పోలీసులు అమాయక ఆదివాసీలపై దాడి చేసి తూపాకిలతో బెదిరించటమే కాకుండా, తూపాకి మడమతో వారందరిపైనా ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగాశిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే వైసిపి కార్యకర్తల్లా వారితో కలిసిపోయి, అమాయక ఆదివాసీలపై దాడులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

తన సొంత డ్రైవరైన దళిత యువకుడిని హత్య చేసి డోర్ డెలివరీ చేయడం ద్వారా రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన ఎమ్మెల్సీ అనంతబాబు, ఇపుడు ఏజెన్సీలో దౌర్జన్యాలు, దాడులకు తెగబడుతూ, ప్రజలు, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడం ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారని, దీన్ని చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. అనంతబాబు తన వైఖరి మార్చుకోకపోతే ఏజెన్సీలో ప్రజా ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన్న.కిరణ్, పార్టీ మండల కార్యదర్శి పాయం.సీతారామయ్య, మండల వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్ పాల్గొన్నారు.

విఆర్.పురం :హత్య కేసులో కండిషన్ బెయిల్‌పై ఉన్న వ్యక్తి ఎమ్మెల్సీ అనంతబాబుకు అర్ధరాత్రి ఎన్నికల ప్రచారానికి పోలీసులు ఎలా అనుమతినిచ్చారని సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, జిల్లా కమిటీ సభ్యులకు పూనం.సత్యనారాయణ ప్రశ్నించారు. అటువంటి వ్యక్తిని సమస్యలపై ప్రశ్నించేందుకు వెళ్లిన ఆదివాసీ యువకులపై దాడులు చేయడం దుర్గాగ్గమన్నారు. మండలంలోని రామవరం పంచాయతీ లక్ష్మీనగరం గ్రామంలో సమావేశంలో వారు మాట్లాడుతూ కూనవరం మండలం కుటూరు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మిని ప్రశ్నించేందుకు వెళ్లిన ఆదివాసీ యువకులపై ఎమ్మెల్సీ అనంతబాబు, అతని అనుచరులు, వైసిపి నేతలతో కలిసి పోలీసులు దాడికి తెగబడడం దుర్మార్గమని, బాధ్యులను ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు కింద కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంపిపి కారం. లక్ష్మి, వడ్లది. రమేష్ కారం సుందరయ్య,. జి లక్ష్మణరావు, ఆసు లక్ష్మయ్య, సిపిఎం సీనియర్ నాయకుడు సిహెచ్. సుబ్బారావు పాల్గొన్నారు



విఆర్.పురంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు సత్యనారాయణ

ప్రశ్నించిన ఆదివాసీలపై దౌర్జన్యం దుర్మార్గం

బాధ్యులను కఠినంగా శిక్షించాలి: టిడిపి

ప్రజాశక్తి- విఆర్ పురం: కూనవరం మండలం కూటురు గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్, ఎమ్మెల్యే ధనలక్ష్మిలను సమస్యలపై ప్రశ్నించే ఒదుకు వచ్చిన ఆదివాసీ యువకులు, ఉద్యోగులపై దాడి చేసిన బాధ్యులను కఠినంగా శిక్షించాలని టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి సవలం రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ, దాడి చేయించిన ఎమ్మెల్సీ అనంతబాబు బెయిల్ రద్దుతోపాటు అతని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడి చేయించిన, చేసిన వారిపై తక్షణమే ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఆచంట శ్రీనివాస్, కార్యదర్శి బురక కన్నారావు, జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షులు బీరక సూర్యప్రకాష్ రావు , సీనియర్ నాయకులు ముత్యాల రమేష్, సొసైటీ మాజీ చైర్మన్ ముత్యాల చంద్రశేఖర్ ముంజపు రమణయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నేత రాజేంద్రప్రసాద్

హైకోర్టు సుమోటోగా కేసు నమోదు చేయాలి

మారేడుమిల్లి: గిరిజన ప్రాంతంలో గిరిజనులపై దాడి, శవ రాజకీయాలు చేస్తున్న వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబుపై కఠినమైన చర్యలు తీసుకోవాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పి రాజ్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఘటనపై రాష్ట్ర హైకోర్టు సుమోటోగా కేసు నమోదు చెయ్యాలని కోరారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, తన సొంత కారు డ్రైవర్‌ను చంపి, డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంత బాబును ఇలానే వదిలేస్తే ప్రజలప్రాణాలతో చెలగాటం చేస్తుంటాడన్నారు. వచ్చే ఎన్నికల్లో లబ్ధికోసం ఎంతటికైనా తెగబడే ప్రమాదం ఉందని ఈ ఘటనను బట్టి స్పష్టమౌతోందన్నారు. సమస్యలపై అడగడానికి వచ్చిన గిరిజన యువతపై దాడులకు తెగబడడం వంటి హత్యారాజకీయాలు దుర్మార్గమన్నారు. దీనిపై ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలని కోరారు.

చట్టసభల్లో ప్రజాగళం వినిపించాలంటే...

సిపిఎం అభ్యర్థులనే గెలిపించాలి



అనంతగిరిలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: అరకు పార్లమెంట్, అసెంబ్లీ సిపిఎం అభ్యర్థులకు గెలిపించాలని కోరుతూ మండలంలోని సాగర పంచాయతీ టిక్కిలిబెడ్డ, పసలంద, సిమిలిగూడ, కొడమజోల, మొగిరిగూడ గ్రామాల్లో ఆదివారం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు టి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ, చట్టసభల్లో ప్రజా గళం వినిపించాలంటే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలన్నారు. గిరిజన సమస్యలు, హక్కులు, చట్టాలపై సిపిఎం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. సిపిఎం అభ్యర్థులకు ఓటు వేసి గెలిపిస్తే గిరిజనుల సమస్యలపై చట్టసభల్లో గళం విప్పుతారని చెప్పారు. గిరిజన చట్టాలకు విరుద్ధంగా పని చేస్తున్న టిడిపి, జనసేన, బిజెపి కూటమితో పాటు వైసిపి పార్టీలను ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సిహెచ్ శేఖర్ బాబు, నర్సింగ్, లింగన్న, గిరిజనులు పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

అనంతగిరి: సిపిఎం ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ మండల నాయకులు కోరారు. మండలంలోని వేంగడ పంచాయతీ డాలింగ్ పుట్టు, చీడివలస, గోమంగిపాడులో సీపీఎం లోకుల సర్పంచ్ కిల్లో మొస్యా, వేంగడ మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు పర్యటించారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, జిఒ 3 రద్దు చేయడంతో ఉద్యోగాలు లేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యకర్తలు జి.దేవన్న, ఎం. రామన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి: వి.ఆర్.పురం: ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధిపై అసెంబ్లీలో ప్రజాగళం వినిపించాలంటే సిపిఎం అభ్యర్థులను రానున్న ఎన్నికల్లో గెలిపించాలని సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు డిమాండ్ చేశారు. ఆదివారం కుందులూరు పంచాయతీ గులేటివాడ ఆదివాసి గ్రామాల ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసి గ్రామాల్లో అభివృద్ధి చేసింది సిపిఎం అని, ప్రజలకు ఏ సమస్య వచ్చినా ప్రత్యక్షంగా, పరోక్షంగా వాటి పరిష్కారం కోసం పోరాడింది సిపిఎం మాత్రమేనన్నారు. కుంజా బొజ్జి, సున్నం రాజయ్య వంటి వారంతా సిపిఎం ఎమ్మెల్యేలుగా చేసిన అభివృద్ధిని మన్యవాసులు గుర్తించుకోవాలన్నారు. గడచిన పదేళ్లలో టిడిపి, వైసిపి ప్రభుత్వాలు ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ఎన్నికల రాగానే ఓట్ల కోసం మళ్ళీ గ్రామాలకు వస్తారని, ఎన్నికలు అయిపోగానే మొహాలు తిరిగి చూడరని, అలాంటి వారికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. సిపిఎం అభ్యర్థులు గెలిపిస్తేనే పోడు భూములు పట్టాలు తాగునీరు ఉపాధి హామీ పనులు వంటి ఎన్నో సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల నాయకులు కె.సత్యనారాయణ, గ్రామ శాఖ సభ్యులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



గులేటివాడలో మాట్లాడుతున్న సిపిఎం నేత చిన్నబాబు

5 నుంచి మత్స్యమాడుగులమ్మ జాతర

ప్రజాశక్తి - జి.మాడుగుల: మండల కేంద్రంలోని గ్రామ దేవత మత్స్య మాడుగులమ్మ జాతర మే 5, 6, 7 తేదీల్లో ఘనంగా నిర్వహిస్తామని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో తేదీలను ఖరారు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మత్స్యరాస వెంకటలక్ష్మి, మని కుమారి, ఎం రామచంద్రరావు,సింహాచలంరాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా ఎం.వరహాలరాజు, ఉపాధ్యక్షులుగా వెంకటరమణ, అరుణ్ కుమార్, సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా రామరాజు ఎన్నికయ్యారు.

టిడిపి అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి-చీడికాడ: మండలంలోని చుక్కపల్లి గ్రామంలో ఎన్డీఏ కూటమి మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు ఇంటింటికి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా పైలా ప్రసాదరావు మాట్లాడుతూ, మాడుగులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మాడుగుల నియోజకవర్గం ఇంచార్జ్ రాయపురెడ్డి కృష్ణ, మాజీ ఎంపీపీ కుచ్చు కాశవతి, వైస్ ఎంపీపీ కసిరెడ్డి గణపతి, క్లస్టర్ ఇంచార్జి పేరపు కొండబాబు, రెడ్డి రాము పాతాల ఎర్రినాయుడు, జాజి మొగ్గల ప్రసాద్, శరగడం శివ పాల్గొన్నారు.

మాడుగుల: మండలంలోని చింతలూరు, గుడివాడ అగ్రహారం గ్రామాల్లో టిడిపి, బిజెపి అభ్యర్థుల్ని గెలిపించాలని ప్రచారం చేపట్టారు. సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉండూరు దేవుడు, రాజ్ కుమార్, రమేష్, ఉండూరు రాజు పాల్గొన్నారు.

పెద తీనార్ల లో అనిత ప్రచారం

నక్కపల్లి: మండలంలోని పెదతీనార్ల గ్రామంలో ఆదివారం టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి పార్టీల పాయకరావుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజాగళం యాత్ర చేపట్టారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనిత ఇంటింటా ప్రచారం చేపడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తనను గెలిపిస్తే తాగునీటి, ఇళ్ల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గతంలో తాను చేసిన అభివృద్ధి పనులను వివరించారు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు.

బీసీలు ఐక్యం కావాలి

ప్రజాశక్తి -కోటవురట్ల: రాజ్యాధి పాలన అంత మొందించాలంటే బీసీలంతా ఐక్యంగా పోరాడాలని జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు లక్ష్మణరావు తెలిపారు. ఆదివారం పాములవాక గ్రామంలో వేచలపు జనార్దన్ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీసీలకు ప్రత్యేక గౌరవం తీసుకొచ్చిన పార్టీ తెలుగుదేశం అన్నారు. ప్రస్తుత అధికార పార్టీ బీసీ కులాలను అన్ని విధాలుగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు బీసీలంతా ఏకం కావాలన్నారు. టిడిపి జిల్లా కార్యదర్శి కాశీనాయుడు మాట్లాడుతూ, కీర్తిశేషులు ఎన్టీ రామారావు బీసీలకు ప్రత్యేక గౌరవం తీసుకు వచ్చారని, ప్రస్తుత అధికార పార్టీ నాయకులు తూట్లు పొడిచారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను, బీసీ పల్లి సర్పంచ్ లింగన్న నాయుడు, సత్యనారాయణ, పలువురు బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నారాయణ సేవా సంస్థాన్ సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి -సీతమ్మధార : వికలాంగులకు కృత్రిమ అవయవాలు అందిస్తున్న నారాయణ సేవా సంస్థాన్ సేవలు వెలకట్టలేనివని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్‌రాజు కొనియాడారు. రాజస్థాన్ ఉదయపూర్‌కు చెందిన నారాయణ సేవా సంస్థాన్ ఆధ్వర్యాన ఆదివారం అక్కయ్యపాలెం సమీపంలోని పోర్టు ఇండోర్ స్టేడియంలో కృత్రిమ అవయవాల కొలత శిబిరం నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 500 మందికి పైగా వికలాంగులు ఈ శిబిరంలో పాల్గొని తమలోని లోపం గల అవయవాలకు సంబంధించిన కొలతలను తీయించుకున్నారు. వీరికి మూడు నెలల తర్వాత ఉచితంగా కృత్రిమ చేతులు, కాళ్లు పరికరాలు అందిస్తామని నిర్వాహకులు వెల్లడించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా ఉత్తర నియోజకవర్గం టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు హాజరై మాట్లాడారు. ఎంతో ఖరీదైన కృత్రిమ అవయవాలను నారాయణ సేవా సంస్థాన్ సొంత ఖర్చుతో అందించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థలు, లయన్స్ క్లబ్, ఆంధ్ర ఆర్టిస్ట్ ఫెడరేషన్, సోషల్ మీడియా క్లబ్, డాక్టర్ చిరంజీవి కళాపరిషత్, స్థానిక నారాయణ సేవా సంస్థాన్ ప్రతినిధులు పాల్గొని వికలాంగులకు సేవలందించారు.

నర్సీపట్నంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్

క్రీడాకారులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం ఆర్వీ మార్టియల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ కరాటే కాంపిటేషన్స్‌లో నర్సీపట్నం, యండపల్లి తదిత ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పాల్గొని బెల్ట్ టెస్ట్ పాస్ అయి వివిధ రకాల గ్రేడ్స్‌లో బెల్ట్‌లు తమ సొంతం చేసుకున్నారు. ఎల్లో బెల్ట్, ఆరెంజ్, గ్రీన్, బ్లూ బెల్ట్, బ్రౌన్, పర్పుల్ బెల్ట్, బ్లాక్ బెల్ట్ వివిధ కేటగిరిల్లో క్రీడాకారులకు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వ్యాపారవేత్త, రాయల్ పార్కు రిసార్ట్ అధినేత బంగారం, వాసవీ క్లబ్ అధినేత వెలగా నారాయణరావు, ప్రముఖ ఆంగ్ల ఉపాధ్యాయురాలు, అంతర్జాతీయ క్రీడాకారిణి పివిఎం నాగజ్యోతి పాల్గొని వివిధ రకాల బెల్ట్‌లు, సర్టిఫికేట్లు ప్రధానోత్సవం చేశారు. ఈ సందర్భంగా పివిఎం.నాగజ్యోతి మాట్లాడుతూ, మార్షల్ ఆర్ట్స్‌లో యువత రాణించాలని, ముఖ్యంగా యువతులు మార్షల్ ఆర్ట్స్‌లో తర్ఫీదును పొందడంతో సమాజంలో ఎదురవుతున్న విపత్కర పరిస్థితులను ఎదుర్కోగలిగే ధైర్యం వస్తుందన్నారు.

కనీస వసతులు కరువు

రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్ల లేక అవస్థలు
ఇదీ గొట్టువాడ కాలనీ వాసుల దుస్థితి

ప్రజాశక్తి- కోటవురట్ల: మండలంలోని గుట్టువాడ గ్రామంలో ప్రభుత్వ కాలనీ ఇళ్ల వద్ద కనీస వసతులు లేక లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. గ్రామంలో నర్సీపట్నం, పోలవరం రోడ్డు ప్రధాన రహదారిని ఆనుకుని ప్రభుత్వం డి ఫామ్ పట్టా భూమిని కొనుగోలు చేసి సుమారు 31 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేసి ఇల్లు మంజూరు చేసింది. ఇక్కడ అందరూ ప్రస్తుతం ఇల్లు నిర్మించుకుంటున్నారు. దాదాపు చాలా మంది గృహ ప్రవేశాలు కూడా చేశారు. ఇక్కడ ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో పాత గొట్టువాడ గ్రామానికి చెందినవారు అధికంగా ఉన్నారు. నిర్మాణాలు దాదాపు పూర్తయినా ఇక్కడ కనీస వసతులు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా తాగునీరు కోసం నానా అవస్థలు పడుతున్న పరిస్థితి నెలకొంది. అదేవిధంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధిలైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా తాగునీటి కోసం కొత్తగొట్టు వాడ ప్రాంతానికి వెళ్లి సుమారు కిలోమీటర్ దూరం వరకు నడిచి వెళ్లి నీరు తెచ్చుకోవలసిన పరిస్థితి నెలకొంది. కాలనీలో రోడ్ల నిర్మాణాలు, వీధిలైట్ల నిర్వహణ సక్రమంగా లేక రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ జల్జీవన్ మిషన్ ద్వారా తూతూ మంత్రంగా పైపులైను నిర్మించారు. కాలనీ వద్ద వాటర్ ట్యాంక్ లేక పోవడంతో నిరుపయోగంగా మారింది. కొండవాలు ప్రాంతాన నిర్మించడంతో వర్షాలు అధికంగా కురిసినప్పుడు ఇళ మధ్య నుంచి నీరు ప్రవహిస్తున్నట్లు కాలనీవాసులు వాపోతున్నారు. స్థానికంగా ఇళ్ల ముందు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకున్నా బండరాళ్లు ఉండటంతో నీరు ఇంక లేదు. సత్వరమే తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరచాలని, వీధిలైట్లు తాగునీటి సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



క్రికెట్ టోర్నీ ప్రారంభంలో ఎంపిపి లక్ష్మి, జెడ్‌పిటిసి రంగారెడ్డి తదితరులు

చొప్పలిలో మెగా క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - విఆర్.పురం: మండలంలో రామవరం పంచాయతీ చొప్పలి గ్రామంలో కారం సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంపిపి కారం. లక్ష్మి, జెడ్‌పిటిసి వాళ్ళ రంగారెడ్డి సమక్షంలో స్థానిక సర్పంచ్ కారం బుచ్చమ్మ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి, జెడ్‌పిటిసి మాట్లాడుతూ, నాలుగు మండలాల పరిధిలోని క్రికెట్ జట్లతో ఇటువంటి మెగా టోర్నీ నిర్వహించడ అభినందనీయమన్నారు. ప్రతిజట్టూ గెలుపే లక్ష్యంగా ఆడాలని, అదే సమయంలో ఓటమిని పోరాటస్ఫూర్తితో తీసుకోవాలన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారికి బెస్టాఫ్ లక్ చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వడ్లది రమేష్ టిడిపి ప్రధాన కార్యదర్శి కన్నారావు, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సవలం రాజేంద్రప్రసాద్, నియోజక వర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు బీరక సూర్య ప్రకాశరావు, తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆకోజు భాగ్యలక్ష్మి, వడ్లది రమేష్, రంగాచారి, మిడియం వీరయ్య, సత్యం, ఉర్మ చిన్నబుచ్చయ్య, ఉర్మ సీతారామయ్య, గ్రామ పెద్దలు, గ్రామస్తులు క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మూడు పశువులు మృతి

ప్రజాశక్తి - మోతుగూడెం. : చింతూరు మండలం వాలమూరుగొంది గ్రామంలో ఆదివారం విద్యుత్ షాక్‌తో మూడు పశువులు మృతి చెందాయి. తెగిపడిన విద్యుత్ వైర్లను తాకడంతో షాక్‌కు గురై మూగజీవాలు మృత్యువాత పడినట్లు స్థానికులు అంటున్నారు. అయితే మతిచెందిన పశువులు తమకు చెందినవి కాదని, ఎవరివనేది గుర్తించాల్సి వుందని గ్రామస్తులు అంటున్నారు. ఘటనాస్థలాన్ని ఎంపిటిసి సభ్యుడు సవలం నరేష్, వైసిపి మండల కన్వీనర్ రామలింగారెడ్డి, నాయకులు పరిశీలించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్‌శాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా గతంలో కూడా గ్రామంలో నాలుగు పశువులు మృతి చెందాయని, వాటికి ఇంతవరకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. పదేపదే ఇటువంటి ఘటనలు పునరావృతం కావడం ఆందోళన కరమని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. మృతి చెందిన పశువులు ఎవరివనేది గుర్తించి, వారికి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన

ప్రజాశక్తి - రంపచోడవరం : ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే ఆదేశానుసారం సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహనకు రాజమహేంద్రవరానికి చెందిన విఎస్‌ఆర్ రూరల్ మీడియా, విభూతి బ్రదర్స్ ఆధ్వర్యంలో ఐదు బృందాలు ఏజెన్సీలోని ఏడుమండలాల్లో కళాజాతా ప్రదర్శలన ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. వీధి నాటిక, జానపద గీతాలు, హాస్యవల్లరి వంటి కార్యక్రమాల ద్వారా సికెల్‌సెల్ ఎనీమియాతోపాటు మలేరియా డెంగ్యూ జ్వరాలపై అవగాహన కల్పిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేస్తున్నారు. వ్యాధి లక్షణాలను వివరిస్తూ, వెంటనే వైద్యులను సంప్రదించి, తగు చికిత్స పొందాలని సూచిస్తున్నారు.

ముస్లిములు ఎటు వైపు ?

విశాఖ దక్షిణంపైనే అందరి చూపు
ఎన్నికల్లో ప్రభావం చూపనున్న సిఎఎ అంశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

విశాఖ నగర పరిధిలో అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న నియోజవర్గం దక్షిణం. దీనికి కారణం లేకపోలేదు. ఈ నియోజకవర్గంలో హిందువులతో పాటు, ముస్లింలు, క్రిస్టియన్లు అధిక సంఖ్యలో ఉన్నారు. ఆ మూడు మతాలకు చెందిన ప్రసిద్ధి చెందిన దేవాలయాలు, మసీదులు ఈ నియోజకవర్గంలోనే ఉన్నాయి. అంతేకాకుండా రోజ్ హిల్స్ కొండపై మూడు మతాలకు చెందిన ప్రముఖ దేవాలయాలు కొలువుదీరి ఉన్నాయి. అయినప్పటికీ ఇక్కడ మతసామరస్యానికి ఎటువంటి అవరోధమూ లేదు. ఆ ప్రస్తావన ఇక్కడ రాదు. అందరూ కలిసిమెలిసి ఉంటారు. ఈ నేపథ్యంలో దక్షిణ నియోజకవర్గం రాజకీయంగా కూడా ఎంతో చైతన్యం కలిగినది. విశాఖలోని మిగతావాటితో పోలిస్తే ఈ నియోజకవర్గంలో ముస్లిములు గణనీయంగా ఉన్నారు. పాలకులు మారుతున్నా వారి సమస్యలు పరిష్కారం కావడం లేదు. దీనికి తోడు కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత వీరు అభద్రతా భావానికి లోనవుతున్నారు. అందునా నరేంద్ర మోడీ ప్రభుత్వం ముందుకు తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)పై వీరు ఆగ్రహంతో ఉన్నారు. ఆ చట్టం అమలు కోసం నిబంధనలు ప్రకటించడంపై ఇక్కడి వారు పెద్ద ఎత్తున ఉద్యమించారు. మునుపెన్నడూ లేనంతగా నగరంలో ముస్లిములు భారీగా కదిలి నిరసనలు తెలిపారు. కేంద్ర బిజెపికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతునిస్తున్న టిడిపి, జనసేన, వైసిపిలను దుమ్మెత్తిపోశారు. ఈ క్రమంలో ఈ ఎన్నికల్లో వారు ఎటువైపు ఉంటారన్న విషయం రాజకీయ పార్టీలకూ అంతుబట్టడం లేదు.

స్వాతంత్ర్య సమరయోధుడు తెన్నేటి విశ్వనాథం వంటి ప్రముఖులు ఒకప్పటి విశాఖపట్నం నియోజవర్గం (ఇప్పటి దక్షిణం) నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ద్రోణంరాజు సత్యనారాయణ వంటి సీనియర్ రాజకీయవేత్త విశాఖ-1 (ఇప్పటి దక్షిణం) నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ప్రస్తుతం మిజోరాం గవర్నర్‌గా ఉన్న డాక్టర్ కె.హరిబాబు సైతం గతంలో ఇక్కడి నుంచే గెలిచారు. అలాగే ఒకప్పటి విశాఖపట్నం నియోజవర్గం నుంచి 1972లో ముస్లిం నేత డాక్టర్ ఎంఆర్ డీన్ కాంగ్రెస్ అభ్యర్థిగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1994లో విశాఖ 1 టిడిపి అభ్యర్థి ఎస్‌ఎ.రెహమాన్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2004లో ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికైన ద్రోణంరాజు సత్యనారాయణ ఆకస్మికంగా మరణించడంతో 2008లో ఉప ఎన్నిక వచ్చింది. ఆ ఎన్నికల్లో ఆయన కుమారుడు ద్రోణంరాజు శ్రీనివాసరావు కాంగ్రెస్ అభ్యర్థిగాను, ఎస్‌ఎ.రెహమాన్ టిడిపి అభ్యర్థిగాను పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో రెహమాన్ ఓటమి చెందారు. ఈ విధంగా చూస్తే ఈ నియోజకవర్గ నుంచి మూడు పర్యాయాలు ముస్లిం నాయకులు పోటీ చేశారు.

ముస్లిం ఓటర్లు అధికం

ఇదిలా ఉండగా ఈ నియోజకవర్గంలో ముస్లిం ఓటర్లు అధికంగా ఉన్నారు. 1999 ఎన్నికల నాటికి వీరి సంఖ్య 10,600 కాగా, ఇప్పుడు వారి సంఖ్య సుమారు 15 వేలకుపైగా ఉంది. నియోజవర్గాల పునర్విభజన రెండు పర్యాయాలు జరిగినప్పటికీ ముస్లిం డామినేషన్ ఉన్న ప్రాంతం మాత్రం ఇదే నియోజకవర్గంలో ఇంతవరకు కొనసాగుతోంది. ఈ



సిఎఎకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేపడుతున్న ముస్లిములు (ఫైల్)

ప్రాంతానికి చెందిన ముస్లిం నేత మహమ్మద్ సాధిక్ అసెంబ్లీ టిక్కెట్టు ఆశించి రాజకీయాలు చేస్తూ వచ్చారు, మూడేళ్ల క్రితం జరిగిన జివిఎంసి ఎన్నికల్లో ఆయన 39వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా కార్పొరేటర్‌గా విజయం సాధించారు. తొలి నుంచి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌ను గట్టిగా వ్యతిరేకిస్తూ రాజకీయాలు చేస్తున్న సాధిక్ ఈసారి కూడా అదే వైఖరిని అవలంబిస్తున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో టికెట్ ఆశించి దాదాపు ఏడాది క్రితం జనసేన పార్టీలో చేరారు. ఈ నియోజకవర్గంలో కూటమి అభ్యర్థిగా జనసేన పోటీ చేసే అవకాశం కలిగినప్పటికీ ఆయనకు కాకుండా పొరుగు నియోజవర్గానికి చెందిన చెందిన వంశీకష్ణ శ్రీనివాస్‌కు ఆ పార్టీ టికెట్ దక్కింది. దీంతో సాధిక్ మౌనం దాల్చారు.

అయితే నియోజవర్గంలో అధిక సంఖ్యలో ఉన్న ముస్లింలు ఈసారి ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతారనేది చర్చనీయాంశంగా మారింది. బిజెపితో జతకట్టి జనసేన పార్టీ ఎన్నికల బరిలో ఉండడంతో ముస్లింలు కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. దీనికి కారణం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి సిఎఎను ముందుకు తెచ్చింది. 2024 ఎన్నికల అనంతరం ఈ చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టంగా ప్రకటించింది. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న ముస్లింలతో పాటు దక్షిణ నియోజకవర్గంలో గరిష్ట సంఖ్యలో ఉన్న ముస్లింలు కూడా దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అంతేకాదు సిఎఎకి వ్యతిరేకంగా ఎవరు పిలుపు ఇచ్చినప్పటికీ రాజకీయాలతో సంబంధం లేకుండా ఈ నియోజకవర్గ ముస్లింలు అధిక సంఖ్యలో కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. బిజెపి చర్యను గర్హిస్తున్నారు. ఇప్పటికీ వారు అదే వైఖరితో ఉన్నారు. ఇది జనసేన, టిడిపి, బిజెపి కూటమి అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులకు పెద్ద నష్టం కలిగించే వీలుందని పరిశీలకులు భావిస్తున్నారు. అదే సందర్భంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి అభ్యర్థులకు ముస్లింల మద్దతు ఉంటుందా అంటే అవుననే సమాధానం రావడం లేదు.

ఈ పరిస్థితిలో ఇండియా కూటమి అభ్యర్థిగా మరోసారి దక్షిణంలో ముస్లిం అభ్యర్థి ఎన్నికల బరిలోకి వస్తే మంచిది అనే అభిప్రాయం కొంతమంది ముస్లిములలో వ్యక్తమవుతోంది. అది సాకారం అవుతుందా లేదా అనేది ఇప్పుడే చెప్పలేం. ఇండియా కూటమి అభ్యర్థుల ఎంపిక ఇంకా పూర్తి కాలేదు. సరైన అభ్యర్థులు ఇండియా కూటమి తరపున ఇటు దక్షిణ అసెంబ్లీకి, అలాగే విశాఖ పార్లమెంట్ స్థానానికి పోటీలో ఉంటే ముస్లిముల మద్దతు ఉంటుందనడంలో సందేహం లేదు.

34వ వార్డులో వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రచారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

దక్షిణ నియోజకవర్గంలోని 34వ వార్డులో జనసేన, టిడిపి, బిజెపి కూటమి అభ్యర్థి వంశీకష్ణ శ్రీనివాస్ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి గ్లాస్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. మనోరమ థియేటర్ నుంచి ప్రారంభమైన ప్రచారం అంబేద్కర్ కాలనీ, జెండా చెట్టు, లక్ష్మీదేవి పేట, భూపేష్ నగర్, తారక రామ కాలనీ, నరహర వీధి, అచ్చియ్యమ్మ పేట వరకు సాగింది. కార్యక్రమంలో టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ పాల్గొన్నారు. 29వ వార్డులో కూడా జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి నాయకులు శ్రావణ్, ఉరుకూటి గణేష్, శేఖర్, మాజీ కార్పొరేటర్ బుద్దాల అనురాధ, మన్యాల శ్రీనివాస్, పరంజి ఈశ్వర్, పి.శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - చింతూరు : శానిటేషన్ వర్కర్ల పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని హైస్కూల్లో శానిటేషన్ వర్కర్లు సమావేశంలో పల్లపు వెంకట్ మాట్లాడుతూ చింతూరు మండలంలోని 80 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారని, రెండు మూడు నెలలుగా వారికి వేతనాలు చెల్లించడం లేదన్నారు. వెంటనే వారికి వేతన బకాయి చెల్లించడంతోపాటు డ్రెస్, షూస్, చీపుర్లు, గ్లౌజులు వంటి భద్రతా సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి పోడియం లక్ష్మణ్, శానిటేషన్ వర్కర్లు. సురేష్. జయలక్ష్మి. సుజాత. గాంధీ. పాల్గొన్నారు.

వారపుసంతలో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి -సీలేరు: ఇండియా ప్రజాబంధు పార్టీ పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి జోసెఫ్ కింటుకూరి ఆదివారం సీలేరు వారపుసంతలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. సంతలోని వ్యాపారులు, కొనుగోలుదారులు, గిరిజనుల వద్దకు వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను బలపరుస్తూ ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ప్రత్యేకంగా మాట్లాడుతూ పాడేరు మండలంలోని చలిపుట్టి గ్రామానికి చెందిన తాను బిఎ,బిఇడి విద్యను అభ్యసించి, 28ఏళ్లపాటు ఐటిడిఎలో ఉపాధ్యాయునిగా పనిచేశానన్నారు. ప్రజలకు సేవ చేయాలనే దృక్పథంతో ఏడేళ్ల క్రితం స్వచ్ఛందంగా ఉద్యోగానికి రాజీనామా చేసి ఆధ్యాత్మిక గురువుగా, సామాజిక కార్యకర్తగా పనిచేస్తున్నానన్నారు. ఇపుడు రాజకీయాల్లోకి వచ్చి ప్రస్తుతం ఇండియా ప్రజాబంధు పార్టీ జిల్లా అధ్యక్షులుగా కొనసాగుతున్నానన్నారు. పాడేరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగాపోటీ చేస్తున్నానని, ప్రజలు తనను ఆదరించి గెలిపిస్తే, నిరంతరం వారి సేవలోనే ఉంటానన్నారు.

ఇంకుడు గుంతలతో మేలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సకల మానవాళికి, జీవులకు నీరు ప్రాణాధారమని, నీటిని పొదుపు చేస్తూ ఇంకుడు గుంతలు నిర్మించి, ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టి, భావితరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. జివిఎంసి పరిధిలోగల ప్రజలకు, వాణిజ్య సముదాయాలకు, వ్యాపార సంస్థలకు, పరిశ్రమలకు నీటి జలాశయాలు, వనరుల ద్వారా నీటిని అందిస్తున్నామని తెలిపారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా పలు చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు.

విశేష సేవలకు పురస్కారాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశ్వ మానవ సౌభ్రాతృత్వాన్ని చాటిన దేశం భారత దేశమని విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అన్నారు. వి డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగిన 'వి పురస్కార్-2024' అవార్డుల ప్రదానోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశం గొప్ప తనాన్ని నేటి తరానికి చాటి చెప్పాల్సిన సామాజిక బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎయు రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, వి డెంటల్ డైరెక్టర్ రమేష్ కెఎంకె, ప్రముఖ బాల గాయకుడు దొంతంశెట్టి ధీరజ్, వి డెంటల్ మేనేజింగ్ డైరెక్టర్ జాన్ మాడుగుల, అనిత మాడుగుల, మైరా మీడియా ఇన్‌చార్జి ఉదయ్ కొల్లి, విఎస్.పద్మనాభరాజు పాల్గొన్నారు. అనంతరం పలు రంగాల్లో విశేష సేవలందించిన వారికి పురస్కారాలు అందజేశారు.